సదరోత్సాహం..!

• ముషీరాబాద్‌లో సదర్ సంబురాలు • అర్ధరాత్రి వరకు కొనసాగిన వేడుకలు



వేడుకల్లో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్యే ముఠా గోపాల్



రాంనగర్ చౌరస్తా సదర్ సమ్మేళనంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్



సదర్ వేడుకల్లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎడ్ల హరిబాబుయాదవ్



వివేక్‌నగర్ బస్తీలో సదర్ సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న పూసరాజు, వినయ్‌కుమార్



దున్నపోతులతో చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, సీఐ రాంబాబు

ముషీరాబాద్: అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల హరిబాబుయాదవ్ ఆధ్వర్యంలో శనివారం సదర్ వేడుకలు ముషీరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. హరియాణా, పంజాబ్, గుజరాత్ నుంచి తీసుకొవచ్చిన ఘోల్, షేక్, శ్రీకృష్ణ, విధాయక్, రాజా తదితర 9 భారీ దున్నలు సందడి చేశాయి. శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ ఆలీ, ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ బడుగు లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీఆర్ఎస్ యువ నేత ముఠా జైసింహ, బీఆర్ఎస్ నగర నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, సీఐ రాంబాబు, సుప్రీం కోర్టు న్యాయవాది ఏవీ రావు ఈ వేడుకలకు హాజరై దున్నపోతుల విన్యాసాలను తిలకించారు. ఈ సందర్భంగా వారిని ఎడ్ల హరిబాబుయాదవ్ ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం సదర్ వేడుకలకు రూ.1.5కోట్లను ప్రకటించడం అభినందనీయమని అన్నారు. ఈ వేడుకలను మరింత ఘనంగా నిర్వహించేందుకు రూ.వంద కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు వరుణ్, అభినందన్‌యాదవ్, సాయి, శ్రీధరాచారి, శివ ముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, శంకర్ ముదిరాజ్, ఎయిర్‌టెల్ రాజు, బి.రాజు పాల్గొన్నారు.

యాదవ సమాజం ఆధ్వర్యంలో..

రాంనగర్ క్రాస్ రోడ్స్‌లో యాదవ సమాజం ఆధ్వర్యంలో సదర్ సమేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనాన్ని మరావోని విజయ్ యాదవ్ సలంద్రి వెంకటేష్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ హాజరయ్యారు.

వివేక్‌నగర్ బస్తీలో సదర్ వేడుకలు

చిక్కడపల్లి: దీపావళి అనంతరం యాదవ సోదరులు ఘనంగా నిర్వహించే సదర్ వేడుకలను గాంధీనగర్ డివిజన్‌లోని వివేక్‌నగర్ బస్తీలో ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్‌లో బీజేవైఎం ఉపాధ్యక్షుడు సంపత్ యాదవ్, రాజు యాదవ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సదర్ సమ్మేళనాన్ని నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ముషీరాబాద్ బీజేపీ కాంటెస్టెంట్ ఎమ్మెల్యే పూసరాజు, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ సదర్ ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులను నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. ఈ వేడుకల్లో ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్, నాయకులు లక్ష్మణ్‌యాదవ్, సాయికుమార్, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు, ఆకుల అభిషేక్, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడప్పుడు.. అక్కడక్కడ..!

ఫాగింగ్ చేస్తున్న ఎంటమాలజీ సిబ్బంది



కవాడిగూడ: ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారు అయింది. దీంతో దోమల వ్యాప్తి పెరిగి జ్వర బాధితుల సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. యూపీహెచ్‌సీ 50 నుంచి 120మంది, బస్తీ దవాఖానాలలో 30 నుంచి 50మంది చికిత్స చేయించుకుంటున్నారు. అయినా కూడా దోమల నివారణకు తీసుకున్న చర్యలు అంతంతమాత్రంగానే ఉన్నాయి.

పెరిగిన ఖర్చులు... తగ్గని దోమలు

ఫాగింగ్ చేసే యంత్రాలలో పెట్రోలు, డీజిల్ వినియోగం అనివార్యం. జీహెచ్ఎంసీ జనరల్ నిధుల నుంచి ఏటా రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా ఆచారణలో మాత్రం దానికి తగిన ప్రయోజనం కనిపించడం లేదు. రోజు సాయంత్రం కనీసం 4 నుంచి 5 బస్తీల చొప్పున ఫాగింగ్ చేయాలి. కాని కార్పొరేటర్లు, రాజకీయ నాయకులు ఉన్న ప్రాంతాల్లో మాత్రమే ఫాగింగ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

◆ వర్షం కురిసే రోజులు తప్పా ప్రతిరోజు ఫాగింగ్ చేస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. వీధులు శుభ్రం చేయడంతోపాటు ప్రతిరోజు సాయంత్రం సమయాలలో బస్తీలు, కాలనీలలో ఫాగింగ్ చేయాలి. కానీ ఎంటమాలజీ విభాగం అధికారులు అప్పుడు అప్పుడు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు.

అధికారులు స్పందించరు



దోమలగూడలోని పలు ప్రాంతాలలో దోమల నివారణకు ఫాగింగ్ చేయడానికి ఎంటమాలజీ విభాగం అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా స్పందించరు. దీంతో బస్తీలో దోమలవ్యాప్తి పెరిగి ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నత అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలి.

– కల్వ నితీష్‌కుమార్, దోమలగూడ

ఎంటమాలజీ సిబ్బందిని పెంచాలి



ఎంటమాలజీ విభాగంలో సిబ్బంది తక్కువగా ఉండటంతో ఫాగింగ్ చేయడానికి సరిపడి సిబ్బంది లేరు. ప్రతి రోజు వస్తున్న ఫిర్యాదులకు మాత్రమే స్పందిస్తున్నారు. మిగతా ప్రాంతాలలో దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

– వెంకటేష్, బీజేపీ నాయకుడు

ఆన్‌లైన్ ఫిర్యాదులకు స్పందిస్తున్నాం..

ప్రతిరోజు ఆన్‌లైన్‌లో వచ్చే ప్రతి ఫిర్యాదుకు తప్పనిసరిగా స్పందిస్తున్నాం. దోమల నివారణలో భాగంగా ప్రతి శుక్రవారం డ్రై డేను నిర్వహిస్తున్నాం. ప్రతి కాలనీలో ఫాగింగ్ చేస్తున్నాం

– మహేష్, ఎంటమాలజీ విభాగం అధికారి

విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 56 శాతానికి పెంచాలి

కాచిగూడ: పెండింగ్‌లో ఉన్న రూ.5వేల కోట్ల విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే మంజూరు చేయాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవడానికి ఈనెల 5వ తేదీన కాచిగూడలో నిర్వహించనున్న బీసీ విద్యార్థుల రాష్ట్రస్థాయి సదస్సులో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంజినీరింగ్, ఇంటర్, పీజీ, డిగ్రీ, ఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏ కోర్సులు చదవిన బీసీ విద్యార్థుల మొత్తం ఫీజులు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ యూనివర్సిటీల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పెట్టాలన్నారు. రాష్ట్రం, కేంద్రంలో విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను బీసీల జనాభా ప్రకారం 27 శాతం నుంచి 56 శాతానికి పెంచాలన్నారు. బీసీ విద్యార్థుల రాష్ట్రస్థాయి సదస్సులో 33 జిల్లాల నుంచి విద్యార్థులు, రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. సదస్సుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం తదితరులు హాజరవుతారని తెలిపారు.

ఘనంగా డీవైఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు



సుందరయ్యపార్కు వద్ద నిర్వహించిన ఆవిర్భావ వేడుకల్లో డీవైఎఫ్ఐ నాయకులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: డీవైఎఫ్ఐ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం సుందరయ్యపార్కు వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ మాట్లాడుతూ... అందరికి విద్యా ఉపాధికోసం రాజీలేని పోరాటం చేస్తున్నామని అన్నారు. దేశంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పరిశ్రమలను ప్రైవేటు పరం చేయాడాన్ని నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎండీ జావేద్, సహాయ కార్యదర్శి రవి, క్రాంతి, వీరేందర్, అజయ్‌రెడ్డి, శివ, సామేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఇంద్రసేనారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవి రాజలింగం

నల్లకుంట: మాజీ ఎమ్మెల్సీ దివంగత ఎస్. ఇంద్రసేనారెడ్డి మరణవార్త తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రముఖ కవి రాజలింగం ఆదివారం సాయంత్రం నల్లకుంట శంకరమఠం మార్కెట్ రోడ్డులోని మృతుడి నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన దివంగత ఇంద్రసేనారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. మృతుడి భార్య అరుణ, కుమారుడు డాక్టర్ ఎస్.వెంకటప్రసాద్‌రెడ్డి ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.హరినాథ్‌రెడ్డి, సంజనరెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డి, మహేష్‌యాదవ్, విజయలక్ష్మి, ఎస్.ఆనంద తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 30వ తేదీన వట్టేపల్లి ఫాతీమానగర్‌కు చెందిన ఎండీ గౌస్ (58) బుద్వేల్–ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతున్నాడు. ఈ క్రమంలో అటువైపు నుంచి వచ్చిన రైలు ఢీకొట్టడంతో అతడు తీవ్రంగా గాయపడ్డారు. అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



ఆనంద రావు(ఫైల్)

నల్లకుంట: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై కృష్ణ తెలిపిన వివరాలు.. ఐబీసీటీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న సముద్రాల ఆనందరావు(44) భార్య సుమ, ఇద్దరు పిల్లలతో కలిసి నల్లకుంట నర్సింహబస్తీలో నివాసముంటున్నాడు. మద్యానికి బానిసైన అతను గత నెల 28వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన భార్య సుమ తన భర్త కనిపించడం లేదంటూ ఆదివారం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరిగపూడి దంపతుల సేవలు అజరామరం



కృష్ణకుమారి జాతీయ స్మారక పురస్కారాల సభలో మాట్లాడుతున్న జస్టిస్ రజనీ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: లయన్ ఆరిగపూడి కృష్ణకుమారి సేవలు అజరామరమని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ టి.రజనీ పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఆరిగపూడి పూర్ణచందర్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన స్వర్గీయ కృష్ణకుమారి స్మారక జాతీయ పురస్కారాల సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ రజనీ మాట్లాడుతూ... మహిళలు త్యాగమూర్తులే కాదని కళా, సాహిత్య రంగాలలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని చెప్పడానికి కృష్ణకుమారి సేవలే నిదర్శనమని అన్నారు. లయన్ కృష్ణ కుమారి, లయన్ విజయ్ కుమార్ దంపతుల సేవలు చిరస్థాయిలో నిలిచిపోతాయి అన్నారు. అనంతరం వివిద రంగాలలో సేవలు అందించిన పలువురు ప్రముఖులను డాక్టర్ అరుణ కోదాటి తదితర ప్రముఖులను కృష్ణకుమారి జాతీయ స్మారక పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, విశ్రాంత ఇన్‌కంట్యాక్స్ చీఫ్ కమిషనర్ ఎం.నర్సింహప్పా, రిటైర్డ్ ఐజీబీవీ రమణకుమార్, సీనియర్ జర్నలిస్టులు రవిశంకర్, వైఎస్ఆర్ శర్మ, డాక్టర్ జల్దీ విద్యాధర్, డాక్టర్ నాళేశ్వరం శంకరం, డాక్టర్ రామకృష్ణ కూడూరి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

లిబర్టీ: రవాణా రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆటో డ్రైవర్స్, క్యాబ్ డ్రైవర్స్ సమస్యలు పరిష్కరిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. అఖిల భారత ఉద్యోగుల అసంఘటిత కార్మికుల సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు కౌశిల్ సమీర్ జన్మదినాన్ని పురస్కరించుకొని జరిగిన వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు.

రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది.?



పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్

ముషీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్ ప్రదీప్, వి.అజయ్ ప్రశ్నించారు. ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశం అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 300 రోజులు పూర్తి అవుతున్నా 50వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ఘనంగా చెప్పుకుంటున్నారని కానీ భర్తీ చేస్తామన్న రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు.

◆ నిరుద్యోగ భృతి ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టి ఏడాది కావస్తున్న దాని ఊసే లేదన్నారు. నిరుద్యోగ భృతిపై దృష్టిసారించని ప్రభుత్వం హడావిడిగా మూసీ నదిపై వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం సిగ్గుచేటన్నారు. ఉద్యోగ కేలండర్ ప్రకటన మాత్రమే చేసి భర్తీ చేయడం మరిచారని విమర్శించారు.

◆ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీసం మందులు కూడా దొరకడం లేదని తెలిపారు. వైద్యులు, నర్సుల కొరత తీవ్రంగా ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వర్, రాకేష్, సహాయ కార్యదర్శులు రవి కుమార్, ప్రతాప్, కోశాధికారి వాసం బుచ్చిరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు భూషణ వేణికృష్ణ, పెండ్యాల రమేష్, కుర్సా రామకృష్ణ, నవీన్, హనీష్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మెస్‌చార్జీల పెంపుపై హాస్టల్ విద్యార్థుల సంబురాలు

ముషీరాబాద్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ హాస్టల్ విద్యార్థుల, గురుకుల విద్యార్థుల మెస్ చార్జీలు పెంచడాన్ని హర్షిస్తూ నగరంలోని కాలేజీ హాస్టల్ విద్యార్థులు ర్యాలీలు నిర్వహించి సంబురాలు జరిపారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ, ఎస్సీ కాలేజీ హాస్టల్స్ నుంచి వందలాది మంది విద్యార్థులు ర్యాలీగా బీసీ భవన్‌కు వచ్చి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను ఘనంగా సత్కరించారు. ఇప్పటి వరకు మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ వందల సార్లు ధర్నాలు, ర్యాలీలు నిర్వహించిన ఫలితంగా ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. గురుకులాలు, హాస్టల్స్‌లో చదువుకునే ఏడు లక్షల 65 వేల మంది విద్యార్థులకు ఈ పెంపుదలతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. మంచి మెనూ తయారు చేసి పౌష్టికాహారం పెట్టాలని హాస్టల్స్‌లో సౌకర్యాలు మెరుగుపరచాలని ఆర్.కృష్ణయ్య కోరారు. అలాగే హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ, విద్యార్థి నాయకులు కె.శివ, ఆర్.కవిత, బలరామ్, మల్లేష్, సి.హెచ్.శ్రీనివాస్, నవీన్‌కుమార్, వినయ్‌గౌడ్, సురేష్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ప్రారంభం



బాగ్‌లింగంపల్లిలో ఉచిత డ్రైవింగ్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ వై.మురళీధర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేశవ స్మృతి సంవర్ధన సమితి, కేశవ నిలయం బర్కత్‌పుర సహకారంతో ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఆదివారం 15వ బ్యాచ్‌ను బాగ్‌లింగంపల్లిలో డాక్టర్ వై.మురళీధర్, కొప్పొరపు బాలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువతలో స్వయం ఉపాధిని పెంపొందించేందుకు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో డ్రైవింగ్ స్కూల్ ప్రొప్రైటర్ ఉపేందర్, న్యాయవాది చంద్రశేఖర్, రామచంద్రా, రవి శంకర్, సిద్ధి రాఘవేంద్ర పాల్గొన్నారు.

వరదల నివారణకు ప్రత్యేక విధానం రూపొందించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పి.నారాయణరావు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: హైదరాబాద్‌లోని ప్రజల శ్రేయస్సును కాపాడుతూ చెరువుల సంరక్షణ, పునరుద్ధరణ ద్వారా వరదలను నివారించడానికి సమగ్ర విధానాన్ని రూపొందించాలని పలువురు వక్తలు కోరారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జస్టిస్ మూమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వరదలు లేని హైదరాబాద్ అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సైంటిస్టు బాబూరావు డాక్టర్ పి. నారాయణరావు, డీబీఎఫ్ జాతీయ కన్వీనర్ పి. శంకర్‌లు మాట్లాడుతూ.... చెరువుల పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్‌లో వచ్చే వరదల ప్రభావానికి తగిన ప్రణాళిక ఉండాలని సూచించారు. వరదల్లో నష్టపోయిన వారికి పునరావాసం అవసరమైన వారికి పరిహారం, పునరుద్ధరణ కోసం తగిన నిధులు కేటాయించాలని సూచించారు. ప్రామాణిక మార్గదర్శకాల ప్రకారం చెరువులు, కుంటలు, నాలాలు సహ అన్ని నీటి మూలాలపై పూర్తి సర్వే నిర్వహించి అక్రమ కట్టడాలు ఎన్ని ఉన్నాయో గుర్తించి ఆ సర్వే వివరాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమ్ముల సురేందర్, రేణుశ్రీ, కె.మహేష్, నరేందర్, గౌతం రాగి, రేణుక, శశికళ తదితరులు పాల్గొన్నారు.

ఆకాశదీపం వెలుగు.. అజ్ఞానపు చీకట్లు తొలగు!

అంబర్‌పేట: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం కార్తీకమాస ఆకాశదీపం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన సేవా సమితి చైర్మన్ జ్ఞానేశ్వర్‌గౌడ్, అంబర్‌పేట బొడ్రాయి పునర్ నిర్మాణ కమిటీ కన్వీనర్ చింతల శ్రీనివాస్‌ముదిరాజ్ మాట్లాడారు. కార్తీకమాసం శివకేశవులకు ఎంతో ప్రీతికరమైనదని అన్నారు. సనాతన ధర్మంలో దీపానికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. కార్తీకమాసం కూడా ఆకాశ దీపంతోనే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. దీపం వెలుగుతో సమాజంలో అజ్ఞానపు చీకట్లు తొలగి ఆధ్యాత్మిక జ్యోతి ప్రజ్వలిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్‌గౌడ్, సుధాకర్, శ్రీధర్, పాండు, తుకారం, భోజరాజు తదితరులు పాల్గొన్నారు.



అంబర్‌పేటలో జరిగిన ఆకాశదీపం పూజల్లో పాల్గొన్న జ్ఞానేశ్వర్‌గౌడ్, చింతల శ్రీనివాస్ ముదిరాజ్

ఇంటర్ కాలేజ్ చాంపియన్‌షిప్‌లో సత్తాచాటిన 'అంబేడ్కర్' విద్యార్థులు



అంబేడ్కర్ కళాశాల విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రొ. రాజేష్‌కుమార్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ చాంపియన్‌షిప్ పోటీలలో బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. 42 జట్లు పాల్గొన్న పోటీల్లో అంబేడ్కర్ కళాశాల జట్టు రెండో స్థానంలో నిలిచింది. అందులో ఎంబీఏ ప్రథమ సంవత్సర విద్యార్థి ఎ.పురుషోత్తంకు బంగారు పతకం, బీఎస్సీ ప్రథమ సంవత్సర విద్యార్థి కె.కౌశిక్‌ప్రణయ్‌కు రజత పతకం, బీకాం ప్రథమ సంవత్సర విద్యార్థి ఎం.పుష్కర్‌యాదవ్‌కు కాంస్య పతకం గెలుచుకున్నట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్ తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ఇలాంటి పతకాలు మరెన్నో సాధించడానికి విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఓయూ ఫిజికల్ ఎడ్యూకేషన్ ప్రొ. డాక్టర్ రాజేష్‌కుమార్ విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



భోలక్‌పూర్ పీఅండ్‌టీకాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ముషీరాబాద్: ప్రజల సహకారంతో ముషీరాబాద్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పరుస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని పీఅండ్‌టీ కాలనీలో రూ.45లక్షలతో జీప్లస్ వన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... 5 నెలల్లో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పూర్తి చేసి కమ్యూనిటీ హాల్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. అభివృద్ధి పనుల విషయంలో స్థానికులు సామాజిక బాధ్యతతో అధికారులు, తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే కావాల్సిన సదుపాయాలను కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

◆ రాజా డీలక్స్ చౌరస్తా వద్ద నిత్యం డ్రైనేజీ పొంగడంతో రోడ్డు గుంతలమయంగా మారుతోందని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమస్యపై జీహెచ్ఎంసీ కమిషనర్, జలమండలి ఎండీకి సైతం ఫిర్యాదు చేశామన్నారు. అధ్వానంగా మారిన రోడ్లను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పరుస్తూ ప్రజల రాకపోకలకు ఆటంకాలు లేకుండా కావాల్సిన నిధులను విడుదల చేయిస్తున్నామని పేర్కొన్నారు.

◆ ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, పార్టీ సీనియర్ నాయకులు బింగి నవీన్, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, నాయకులు గోవింద్‌రాజ్, మగ్బూల్, ప్రవీణ్, పీఅండ్‌టీ కాలనీ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు లత, కాలనీ నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.